
# ఔట్...

"నాన్నా...అయ్, జె, కె, యల్ తర్వాత ఏ అక్షరం వస్తుంది? యమ్మా, యన్నా?"

పరంధామయ్య చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి తన నాలుగేళ్ళ కొడుకు పండు వంక చూశాడు.

"బడుద్దాయ్... ఆ మాత్రం తెలీదురా? యల్ తర్వాత యమ్ వస్తుంది..." అని చెప్పాడు.




"నాకు తెల్సుగా... హిహిహి." నవ్వాడు పండు.

"మరి తెలిస్తే ఎందుకు అడిగావ్?"

"నేను అడుగలేదుగా!.... అన్నయ్య అడిగాడు....హిహిహి..."

పరంధామయ్య ఆశ్చర్యంగా పండు పక్కనే పుస్తకం పట్టుకుని కూర్చున్న నారాయణ వంక చూశాడు.

"ఏరా... ఈ ప్రశ్న నువ్వడిగావా?"

"అవును..." అన్నాడు నారాయణ.

"ఇలాంటి ప్రశ్న అడగడానికి సిగ్గులేదూ?..."

తండ్రి అలా అన్నాక కూడా సిగ్గుపడకపోతే బాగుండదని నారాయణ తల వంచుకుని సిగ్గుపడ్డాడు.

"ఏం రోజులొచ్చిపడ్డాయ్‌రో నాయనో... పదో తరగతి చదివే వాడికి ఏబిసిడీలే రావు..."
నిట్టూర్చాడు పరంధామయ్య.
"ఎలా వస్తాయేంటి?... ఒకటో తరగతి నుండి ఏడో తరగతి దాకా పబ్లిక్ పరీక్షే లేదు... అందుకే ఏడు సంవత్సరాలు ఏమీ చదవకుండానే సెవెంత్ దాకా వచ్చేశాను. ఏడో తరగతి పరీక్ష పేపర్లు ఔటయ్యాయ్. ఆ అవుటయిన క్వశ్చన్ పేపర్లకి ఆన్సర్లు మీరేగా టెక్స్టట్ బుక్స్‌లో టిక్ పెట్టి ఇచ్చారు... ఆ టెక్స్టట్ బుక్ పరీక్ష హాల్లో టేబుల్ మీద పెట్టుకుని హాయిగా కాపీ కొట్టి పాసయ్యాను.... మళ్లీ పదో తరగతి దాకా పబ్లిక్ ఎగ్జామ్ లేదు కాబట్టి చదువుకూడా లేదు... మరి ఏ అక్షరం తర్వాత ఏమొస్తుందో ఎలా గుర్తుంటుందేంటీ... అందుకే ఆల్ఫబెట్స్ నెంబర్లా రివిజన్ చేస్తున్నా..."
"ఛీఛీ... సిగ్గులేదు... నాకొచ్చినంత కూడా రాదు...హిహిహి..." అంటూ నవ్వాడు పండు.
"నాన్నా... అన్నయ్యకి వన్ టు హండ్రెడ్ దాకా చెప్పటం రాదు... హిహి..."
పరంధామయ్య నెత్తి కొట్టుకున్నాడు.
నారాయణ సిగ్గుపడ్తూ తల వొంచుకున్నాడు.
"సిగ్గుపడింది చాల్లే... ఇంక తలెత్తు! ఎప్పుడూ లేంది ఈ వేళ కొత్తగా పుస్తకం పట్టుకుని కూర్చున్నావేం?..."
"ఎల్లుండి నుండి పరీక్షలు కదా?... అందుకని! ముందు ఏబిసిడిలు ఒంట్లో ఓసారి చూస్కుని తరువాత పాఠాలు చదువుతాను..."
"సర్లె... సర్లె... ఎలాగోలా తగలడు..."
"మరి...మరి...హిహి... ఈ టెన్త్ పరీక్షలయ్యేక మళ్లీ డిగ్రీ ఫైనలియర్‌దాకా పరీక్షలుండవా నాన్నా?"
"ముందు ఈ పరీక్షరాసి పాసయి తగలడు... డిగ్రీ పరీక్షల గురించి తరువాత ఆలోచిద్దాం... టెన్త్ చదువుతున్నావ్!ఎబిసిడిలు దేని తరువాత ఏదొస్తుందో తెలీదు సిగ్గులేని మొహం నువ్వూను!" విసుక్కున్నాడు పరంధామయ్య.
అతను ఈ మాట అంటుండగా అతని భార్య మీనాక్షి ఆ గదిలోకి వచ్చింది.
"ఎవర్దీ సిగ్గులేని మొహం... మీరు మాత్రం మీ చిన్నప్పుడు చదివి

పాసయ్యారా?... అత్తయ్యగారు నాకు చెప్పారు లెండి.... మీరు కాపీలు కొట్టి పాసయ్యారని..." అంది మీనాక్షి.
"ఇప్పుడు ఆ విషయాలన్నీ ఎందుకులే మీనా..." తడబడుతూ అన్నాడు పరంధామయ్య.
"ఎందుకేంటటి?... సందర్భం వచ్చింది కాబట్టి చెప్తున్నా! లేకపోతే అనవసరంగా మా బాబుని అంటారా?... యేం? ఎబిసిడిలు మీకు వర్సగా చెప్పడం వచ్చాయా చెప్పండి 'కె' తర్వాత ఏమొస్తుందో!"
"కె తర్వాత....హి... మరేమో... 'కె' తర్వాతా... హి..." బుర్ర గోక్కుంటూ ఇబ్బందిగా నవ్వాడు పరంధామయ్య.
"హువ్వ! షేం షేం... నాన్నకి 'కె' తర్వాతేమొస్తుందో తెలీదు... ఛీఛీ... హిహిహి..."
పండు చప్పట్లు కొడ్తూ గంతులులేస్తూ నవ్వాడు.
"ఒరేయ్! వీపు చీరేస్తా నోర్ముయ్..." కోపంగా అరిచాడు పరంధామయ్య.
"ఊ...ఊ... చీర్తారు చీర్తారు! వాడి వంటిమీద చెయ్యి పడిందంటే మీ వీపు నేను చీర్తాను!..." అది మీనాక్షి చిటపటలాడ్తూ.
అంతలో నారాయణ స్నేహితుడు సత్యారావు వచ్చాడు.
"ఒరేయ్!... అలా బయట కెళ్లొద్దాంరా..." అన్నాడు నారాయణతో గదిలోకి అడుగుపెడ్తూనే.
"న్నేనాను... ఎల్లుండి నుండి పరీక్షలు కదా! నేను చదూకోవాలి!" అన్నాడు నారాయణ.
నారాయణ సమాధానం వింటూనే సత్యారావు ఘొల్లుమని నవ్వాడు.
"నీ మొహానికి సిగ్గుందా?... పరీక్షలైతే ఎవరైనా చదువుతారా?... నువ్వేం కష్టపడ నక్కర్లేదు... క్వశ్చన్ పేపర్లు అవుటవుతాయ్... ప్రతి సంవత్సరం జరిగేదేగా?..." అన్నాడు నవ్వాపుకుంటూ.
"ఒకవేళ ఈ సంవత్సరం అవుటవకపోతే?" దేభ్యం మొహంవేస్కుని అడిగాడు.
"ఇన్ని సంవత్సరాలూ విద్యార్థులు చేస్కున్న పుణ్యం ఏమిటి? మనం చేస్కున్న పాపం యేమిటి?... పేపర్లు అవుటవకపోతే ఊర్కుంటామా? ఎగ్జామ్స్ బోయ్‌కాట్ చేస్తాము..."
"అంతే నంటావా?...."
"అంతే...ముందు నువ్వు బయటికి రా.... అక్కడెక్కడో క్వశ్చన్ పేపర్లు అమ్ముతున్నారట!" తొందరపెట్టాడు సత్యారావు.

"వెళ్లరా అబ్బాయ్!... ఆ పేపర్లేవో కొనుక్కొని పరీక్షలు చక్కగా రాసి డిగ్రీ కూడా ఇలానే రాసి పాసయి మాంచి ఉద్యోగం సంపాదించి లంచాలు కొట్టి కూడబెట్టి చల్లగా బతుకు బాబూ..." దీవించింది మీనాక్షి.
"సరేనమ్మా..." అని తల్లితో చెప్పి, "పదరా పోదాం" అన్నాడు సత్యారావు వంకతిరిగి.
"ఉండు బాబూ!... పేపర్లు దొరకాలని దేవుడికి మొక్కుకో బాబూ...." అంది మీనాక్షి.
నారాయణ పూజ గదిలోకి వెళ్ళి దేవుడికి మొక్కుకున్నాడు.
"స్వామీ... మా పరీక్ష పేపర్లు అవుటయ్యేలా చేసి నాకు దొరకేలా చూడు స్వామీ!... నేను పరీక్షల్లో పాసయ్యేలా చూడు స్వామీ... మా అమ్మ కోరుకుంటున్న విధంగా నాకు పెద్దయ్యాక లంచాలు దొరికే ఉద్యోగం వచ్చేలా చూడు స్వామీ... నువ్విలాంటి కోర్కెలు తీరుస్తావనే నిన్ను కోరుకుంటున్నా స్వామీ...నువ్వున్నది మా లాంటి వారి కోర్కెలు తీర్చడానికేనని నాకు తెల్సు స్వామి... నేను పరీక్ష పాసవుతే నాలుగు... ఉహూ... పోనీ అరడజను కొబ్బరి కాయలు కొడ్తా స్వామీ... లేకపోతే ఒక్కటి కూడా కొట్టను స్వామీ... ఈ భక్తుడు తప్పుగా అంటే క్షమించు స్వామీ..." అని చెంపలేస్కొని బయటకి వచ్చాడు నారాయణ.
సత్యారావు, నారాయణ హిమాయత్ నగర్ లోని ఒక సందులోకి వెళ్ళారు. అక్కడ దార్లో వెళ్తున్న ఒక వ్యక్తిని ఆపి "ఇక్కడ పదో తరగతి క్వశ్చన్ పేపర్లెక్కడ అమ్ముతారండీ...?" అని అడిగాడు.
"ఆ పక్క సందులోకి తిరగండి... అక్కడ సెంటర్లో ఒకాయన నిలబడి ఉంటాడు..." వాళ్లకి చెప్పి అతను ముందుకు వెళ్ళిపోయాడు.
వాళ్ళిద్దరూ పక్క సందులోకి తిరిగారు. ఆ వ్యక్తి చెప్పినట్టుగానే అక్కడ సెంటర్లో ఒక వ్యక్తి నిలబడి వున్నాడు... అడ్డచారల బనీను గళ్ల లుంగీతో.
నారాయణ, సత్యారావు మెల్లిగా అతని దగ్గరకి వెళ్లారు.
"ఏవండీ... పదో తరగతి క్వశ్చన్ పేపర్లు ఎక్కడ దొరుకుతాయండీ?..." రహస్యంగా అతన్ని అడిగాడు నారాయణ అటూ ఇటూ చూస్తూ.
"ఇక్కడే.... నా దగ్గరే దొరుకుతాయ్!"
తొణుక్కుండా సమాధానం చెప్పాడు అతను.
నారాయణ మళ్ళీ భయం భయంగా అటూ ఇటూ చూస్తూ అడిగాడు అతని చెవి దగ్గరగా నోరు పెట్టి "ఏయే సబ్జక్టు పేపర్లున్నాయ్ మీ

దగ్గర?"
"చెవి దగ్గర ఆ గుసగుసలేంటి?.... గట్టిగా అడుగు." విసుక్కున్నాడు అతను.
"ఎవరైనా వింటారేమోననీ..." నసిగాడు సత్యారావు తన స్నేహితుడిని సమర్థిస్తూ.
"వింటే ఏమైంది?... నా దగ్గర రహస్యాలేమీ లేవు... అంతా డైరెక్టుగానే చేస్తాను. లేకపోతే రోడ్డుమీద నిలబడి ఎందుకమ్ముతాను?... అడిగేదేదో గట్టిగా అడుగు... అమ్మేవాడిని నాకులేని భయం మీకెందుకు?"
"మీ దగ్గర ఏయే సబ్జెక్టు క్వశ్చన్ పేపర్లున్నాయ్?" గట్టిగా అరుస్తూ అడిగాడు నారాయణ.
"ఓర్నీ అసాధ్యం కూలా!... గట్టిగా అంటే అరవమనా?... నా దగ్గర ప్రస్తుతం ఎల్లుండి, ఆవలెల్లుండి పరీక్షలైన ఇంగ్లీషు, లెక్కలు క్వశ్చన్ పేపర్లున్నాయి. మిగతావి ఇంకా ప్రింటింగులో వున్నాయి... రేపు ప్రెస్సు నుండి అవి బయటికి రాగానే నా దగ్గరికి వస్తాయ్..." చెప్పాడు అతను.
వాళ్లిద్దరూ వంద రూపాయలిచ్చి అతని దగ్గర్నుండి ఇంగ్లీషు, లెక్కల పేపర్లు కొనుక్కున్నారు. ఆ మర్నాడు కూడా వెళ్ళి మిగతా పేపర్లు కొనుక్కున్నారు. ఆ క్వశ్చన్ పేపర్లలోని ప్రశ్నలకి జవాబులు టెక్స్టట్ బుక్స్‌లో ఎవరి చేతో టిక్ పెట్టించుకుని పరీక్షహాలుకి ఆ పుస్తకాలు పట్టుకెళ్లి టేబులు మీద కత్తులు, నాటు బాంబులు పెట్టుకుని పరీక్షలు రాశారు.
'ఆహా... ఏమీ మా భాగ్యమూ...' అని సంబరపడ్తుండగా పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని పరీక్షలు రద్దు చేశారు.
రద్దయిన పరీక్షలు వారం తర్వాత పెడ్తున్నట్లు ప్రకటన చేశారు.
కష్టపడి చదివి, పరీక్షలు బాగా రాసిన విద్యార్థులు నెత్తీ నోరూ కొట్టుకున్నారు.
ప్రశ్నాపత్రాలు ఔటయినందుకు విద్యామంత్రి రాజీనామా చేశాడు.
"ఈ సారి ప్రశ్న పత్రాలు ఔటవకుండా గట్టి చర్యలు తీస్కుంటున్నాం" అంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు.
రేపట్నుండి పరీక్షలనగా నారాయణ, సత్యారావు ఆబిడ్స్ సెంటర్‌లో దిగులుగా నిల్చున్నారు. పరీక్ష ప్రశ్నపత్రాలు ఎలా సంపాదించాలి?... అసలే ముఖ్యమంత్రి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ప్రకటించాడు!!!... అదీ వాళ్ల దిగులు.

ఆకలిగా ఉంటే ఆ పక్కనే ఉన్న మిరపకాయ బజ్జీల బండివాడి దగ్గర రెండు రూపాయల బజ్జీలు కొన్నారు.
అపురావురు మంటూ వేడివేడి బజ్జీలు తిన్న ఆ ఇద్దరూ బజ్జీలు పొట్లం కట్టిన కాగితాన్ని పారేయబోయి ఒకసారి దానివంక పరిశీలనగా చూసి గట్టిగా కెవ్వుమని కేకేశారు.
అది ఆ మర్నాడు వాళ్ళకు జరగబోయే ఇంగ్లీషు పరీక్ష ప్రశ్నాపత్రం!!

* * *